21 నుంచి మార్గశిర పూజలు

విశాలాంధ్ర - వన్‌టౌన్ : వన్‌టౌన్ శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈనెల 21 నుండి డిసెంబర్ 12వ తేదీ వరకు మార్గశిర మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మార్గశిర గురువారం పంచామృత అభిషేకం లక్ష్మివారం రూ.10.000/, అన్ని రోజులు పంచామృత అభిషేకం రూ. 3000 /గాను, మార్గశిర విశిష్ట దర్శనం రూ. 500 /రూపాయలు నిర్ణయించినట్టు తెలిపారు. ముందుగా ఆన్లైన్లో WWW.ap templse.org. బుక్ చేసుకోవచ్చని, అలాగే 9552300009 ద్వారా కూడా బుక్ చేసుకోవచ్చు

ఘరానా కోడలు

అత్తను కుర్చీకి కట్టి పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేసిన వైనం

జయంతి కనకమహాలక్ష్మీ (అత్త)

విశాలాంధ్ర - పెందుర్తి: అత్తను కుర్చీకి తాళ్లతో కట్టి .... ఒంటిపై పెట్రోల్ పోసి ఓ కోడలు అత్యంత దారుణంగా హత్యకు పాల్పడింది. ఈ సంఘటన విశాఖపట్నం జిల్లా, పెందుర్తి మండలం, అప్పన్నపాలెం గ్రామంలో జరిగింది. స్థానిక వర్షిని అపార్ట్మెంట్లో సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి కుటుంబంతో నివాసం ఉంటున్నారు. ఇతను పురోహిత్యం చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. సుబ్రహ్మణ్యం తల్లి జయంతి కనకమహాలక్ష్మీ, భార్య లలితాదేవి, కుమార్తె జయంతి, కుమారుడు శ్రీనారాయణతో కలిసి ఉంటున్నారు. తనపై భర్తకు లేనిపోని మాటలు చెబుతోందని అత్త జయంతి కనకమహాలక్ష్మీపై చాలాకాలంగా కోడలు లలితాదేవి కోపం పెంచుకుంది. దీంతో ఇంట్లో భర్త లేని సమయం చూసి తన కూతుర్ని నాన్నమ్మతో దొంగాట ఆడుకోమని చెప్పి, అత్త చేతులను కుర్చీకి తాళ్లతో కట్టి ముఖంపై గుడ్డ వేసింది. అత్త తన మనవరాలతో ఆటాలాడు కుంటున్నట్లు చిత్రీకరించింది. కొంత సమయం పోయిన తర్వాత కోడలు లలితా దేవి అత్తపై పెట్రోల్ పోసి నిప్పంటించింది. ఇంట్లో దేవుడు వద్ద ఉన్న దీపం అత్తపై పడి కాలిపోయిందని చుట్టుపక్కల వాళ్ళకి చెప్పింది. విషయం తెలుసుకున్న పెందుర్తి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, ఈ కేసును మొదట ప్రమాదంగానే భావించారు. ఆ తర్వాత కుర్చీని పరిశీలించగా, కుర్చీకి రెండువైపులా తాళ్లతో కట్టి ఉన్న దృశ్యం కంటపడింది. దీంతో పోలీసులు తమదైన శైలిలో కోడలు లలితా దేవిని విచారించగా జరిగిన విషయాన్ని ఆమె పోలీసుల వద్ద ఒప్పుకుంది. పెందుర్తి పోలీసులు ఈ కేసును హత్యగా నమోదు చేసి లలితకుమారిని అదుపులోకి తీసుకున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరిద్దాం

విశాలాంధ్ర-సింహాచలం: గ్రేటర్ విశాఖ ప్రధాన, వివిధ కూడల్లో (జంక్షన్లు) లో ట్రాఫిక్ జామ్ అవ్వటానికి ప్రస్తుత రోజుల్లో వాహన చోదకులు కూడా కారణమే. ప్రతివారు ట్రాఫిక్ జామ్ అవ్వగానే ట్రాఫిక్ పోలీసులను నిందించటం సబబు కాదు సుమా అందులో మన పాత్ర (వాహన చోదకులు) కూడా కారణమే. ట్రాఫిక్ జామ్‌కు వాహన చోదకులు కూడా ఒక కారణమే. సిగ్నల్స్ వద్ద వేచి ఉండకుండా వెళ్లడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం, అకస్మాత్తుగా వాహనాలు మార్చడం, వేగంగా వెళ్లడం వంటివి వాహన చోదకుల ప్రవర్తన వల్ల ట్రాఫిక్ రద్దీ ఏర్పడటానికి దోహదం చేస్తాయి. నిబంధనలను పాటించకపోవడం సిగ్నల్స్ వద్ద ఆగకుండా వెళ్లడం, ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించడం వంటివి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తాయి. అనుమతి లేని ఓవర్‌టేకింగ్ వేగంగా వెళ్లి ఓవర్‌టేక్ చేయడానికి ప్రయత్నించడం వల్ల వాహనాల కదలికకు ఆటంకం ఏర్పడుతుంది.

అక్రమ పార్కింగ్: వాహనాలను అక్రమంగా పార్క్ చేయడం వల్ల రోడ్లపై స్థలం తగ్గి, ట్రాఫిక్ రద్దీ పెరుగుతుంది. కొన్ని సందర్భాల్లో, సిగ్నల్స్ సరిగ్గా పనిచేయకపోవడం వల్ల కూడా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. అలాంటి సమయాల్లో వాహన చోదకులు జాగ్రత్తగా వ్యవహరించాలి. ఇష్టానుసారం పోలీసులను, ట్రాఫిక్ పోలీసులపై నిందలు వేయటం ఎంతవరకు సమంజసమో ఆత్మ సాక్షిని ప్రశ్నంచు కోండి. అతిగా అనుకోకండి ఎవరో ఒకరు వలన అందరూ ఇబ్బంది పడాల్సిన సందర్భాలు నిత్యం ఏదో, ఎక్కడో ప్రదేశాల్లో ఎదుర్కొంటున్నాం, కాదంటారా? అదే సమయంలో అంబులెన్స్ వస్తే వాటికి కూడా దారి ఇవ్వలేని పరిస్థితి. ఒక వేళ అంబులెన్స్ వచ్చిందని ఆయా ప్రదేశాల్లో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు ఎంత మానసిక వేదన అనుభవిస్తున్నారో ఎవరికి తెలుసు. కావాలని పోలీసులు ట్రాఫిక్‌ను జామ్ చేయరు. దయచేసి సమయ సందర్భాన్ని బట్టి వాహనాలు నడపండి. అంతే కానీ ట్రాఫిక్ జామ్ కారకులు కావద్దు సుమా...!

కేజీహెచ్‌లో అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం

విశాలాంధ్ర - వన్‌టౌన్: కింగ్ జార్జి ఆసుపత్రిలో అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశాఖపట్నంలో రేడియాలజిస్టులు, రేడియోగ్రాఫర్లు ఉత్సాహంగా పాల్గొని ఎక్సరే ఆవిష్కర్త డాక్టర్ రాంట్జెన్‌కి నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రేడియాల జిస్టుల సంఘ అధ్యక్షులు డాక్టర్ సురేష్ మాట్లాడుతూ ప్రజల్లో రేడియాలజీ సేవల పట్ల అవగాహన తీసుకురావాలన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన కేజీహెచ్ పర్యవేక్షణాధికారి డాక్టర్ వాణి సందేశాన్నిస్తూ ప్రజల నుండి రేడియాలజీ సేవల కోసం ఎంతో ఒత్తిడితో కూడిన డిమాండ్ ఉన్నప్పటికీ కేజీహెచ్‌లో మంచి సేవలు అందిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ బుజ్జి బాబు, రేడియాలజీ ఫ్యాకల్టీ, రేడియోగ్రాఫర్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇక ఫోన్‌లోనే పోస్టల్ సేవలు

డాక్ సేవా యాప్ ఆవిష్కరించిన పోస్టల్ శాఖ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: తపాలా సేవలను ప్రజలకు మరింత చేరువచేసే లక్ష్యంతో ఇండియా పోస్ట్ మార్పులు చేస్తోంది. శరవేగంగా సేవలు అందించేందుకు కొత్తయాప్‌ను ప్రవేశపెట్టింది. తపాలా శాఖ మొత్తం సేవలన్నీ కూడా స్మార్ట్‌ఫోన్ ద్వారానే వినియోగించుకునేలా డాక్ సేవ పేరిట యాప్‌ను విడుదల చేసింది. ఇక పోస్టాఫీస్ మీ జేబులోనే అన్న నినాదంతో పోస్టల్ శాఖ తన ఎక్స్ ఖాతాలో కూడా పోస్టుచేసింది. పార్సిల్ ట్రాకింగ్, పోస్టేజి కాలిక్యులేషన్, ఫిర్యాదుల నమోదు, బీమా ప్రీమియం చెల్లింపులు వంటి సేవలు పొందవచ్చు. స్పీడ్ పోస్టు, మనీ ఆర్డర్ వివరాలను చెక్ చేసుకోవచ్చు. దేశీయ అంతర్జాతీయ పార్శిల్ సేవలకు ఎంత ఛార్జి అవుతుందో తక్షణమే లెక్కించుకోవచ్చు. స్పీడ్ పోస్టు, రిజిస్టరు పోస్టు, పార్సిల్ బుకింగ్ సేవలు గంటల తరబడి లైన్లో ఉండాల్సిన అవసరం లేకుండా యాప్ ద్వారానే పూర్తి చేయవచ్చు. కార్పొరేట్ కస్టమర్ల కోసం ప్రత్యేక యాక్సెస్‌ను కూడా ఏర్పాటుచేసారు. ప్లేస్టోర్, యాపిల్ యాప్ స్టోర్లో డాక్ సేవా యాప్ అని టైప్ చేసి డౌన్లోడ్ చేసుకోవచ్చు. మొబైల్లో యాప్ డౌన్లోడ్ అయ్యాక ఈమెయిల్ ఐడి, లేదా మొబైల్ నంబరుతో రిజిస్టరుఅవ్వాలి. ఒటిపితో లాగిన్ అయి సేవలు పొందవచ్చు.

గీతం స్మార్ట్ ఐడియాథాన్ -2025 పోటీలు

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ (విడిసి) ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నూతన ఆలోచనలను ప్రోత్సహిం చడానికి "స్మార్ట్ ఐడియాథాన్-2025" పేరిట పోటీలను ఈ ఏడాది డిసెంబర్ 12వ తేదీన నిర్వహి స్తున్నట్లు గీతం విడిసి కోచ్ వికాస్ తెలియజేసారు. "స్మార్ట్ ఐడియాథాన్- 2025" పోటీలకు అమెరికాలోని నార్త్ ఈస్ట్రర్న్ యూనివర్సిటీ సెంటర్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ ఎడ్యుకేషన్ మరియు సెంటర్ ఫర్ ఎమర్జింగ్ మార్కెట్ నార్త్ ఈస్ట్రర్న్ యూనివర్సిటీ సహకారం అందిస్తున్నాయని తెలిపారు. దేశంలోని విద్యార్థులలో స్టార్టప్ ఆలోచనలను ప్రోత్సహిం చడానికి వీలుగా ఈ పోటీలను నిర్వహిస్తు న్నామని వెల్లడించారు. ఈ స్మార్ట్ ఐడియాథాన్ పోటీలలో పాల్గొనే జట్లు ఆహారం, వ్యవసాయం, హరిత, సాంకేతిక పరిజ్ఞానం, వ్యర్థాల నిర్వహణ, ఆరోగ్య సంబంధ సాంకేతిక పరిజ్ఞానం, నీటి వనరుల నిర్వహిణ వంటి అంశాల పై నూతన ఆవిస్కరణలను స్టార్టప్‌లుగా మలచడానికి తమ ప్రాజెక్టులతో పోటీలలో పాల్గొన్న వచ్చునని సూచించారు. గీతం విద్యార్థులే కాకుండా దేశంలోని ఏ ప్రాంతంలోని యువత లేదా విద్యార్థి బృందాలు ఐనా ఈ పోటీలలో పాల్గొనవచ్చునని తెలియజేశారు. ఎంపికైన జట్లను అమెరికాలోని బోస్టన్ లో జరిగే పోటీలలో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తామని అలాగే అమెరికాలోని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ లో జరిగే శిక్షణ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు పోటీలలో పాల్గొనడానికి నవంబర్ 11వ తేదీలోగా తమ ఆలోచనలకు సంబంధిచిన వివరాలను, తమ ఆలోచనలను ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పూర్తి సమాచారం కోసం గీతం విడిసి వెబ్‌సైట్‌ను పరిశీలించాల్సిందిగా సూచించారు.

కోరమాండల్ కాంట్రాక్ట్ కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలి

కోరమండల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి

విశాలాంధ్ర - మల్కాపురం: కోరమండల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ సర్వసభ్య సమావేశాన్ని స్థానిక 61వ వార్డు మల్కాపురం గ్రామ మండల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్యనారాయణ రెడ్డి అధ్యక్షత వహించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కోరమండల్ కార్మికులకు 2026 ఫిబ్రవరి నెల నుంచి నూతన అగ్రిమెంట్ జరపాలని, కాంట్రాక్ట్ కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రతి కాంట్రాక్ట్ కార్మికులకు సంవత్సరానికి ఒకసారి సేఫ్టీ షూస్ యూనిఫారం ఇవ్వాలని, ప్రమోషన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోరమండల్ యూనియన్ నాయకులు శంకర్రావు, మహాలక్ష్మి, రమేష్ ఈశ్వరరావు పారిశ్రామిక ప్రాంత ఏఐటీయూసీ కన్వీనర్ గుడాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాన్ని సందర్శించిన జిల్లా జడ్జి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జాతీయ న్యాయ సేవ సహకార సంస్థ స్థాపన దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవ సహకార సంస్థ కార్యదర్శి సీనియర్ జిల్లా సివిల్ జడ్జి ఆర్.సన్యాసి నాయుడు ఎంవిపి కాలనీ నం.1లోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మిఠాయిలు పంచి, భారత రాజ్యాంగం ఉద్దేశించిన సమన్యాయం, సామాజిక న్యాయం, అందరికీ న్యాయం అందుబాటు వంటి విలువలను వివరించారు. రాజ్యాంగంలోని ఆదేశ సూత్రాల ప్రకారం ఆర్టికల్ 39ఏ ఆధారంగా 1987లో జాతీయ న్యాయ సేవ సహకార సంస్థ ఏర్పాటైందని తెలిపారు. విద్యార్థులు కృషి చేసి ఉన్నత స్థానాలకు చేరి సమాజానికి సేవ చేయాలని, దేశానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు కే. రామారావు, సహాయ అధికారి ఆర్. శ్యామల, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ మహేంద్ర మణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి

కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: నగరంలో చేపడుతున్న రోడ్ల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. సాగరమాల ప్రాజెక్టులో భాగంగా కాన్వెంట్ జంక్షన్ నుంచి ఐ.ఎన్.ఎస్. డేగ, పోర్టు డాక్ ఏరియా వరకు చేపడుతున్న రోడ్డు పనులను జీవీఎంసీ, ఎన్.హెచ్. విభాగాల అధికారులతో కలిసి శనివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. పార్టెనర్షిప్ సమ్మిట్ నాటికి అన్ని పనులను పూర్తి చేయాలని, వేగంగా వేయాలనే కారణంతో నాణ్యత విషయంలో రాజీ పడొద్దని సూచించారు. అన్ని ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేయాలని చెప్పారు. సంబంధిత విభాగాల అధికారులు పనులను నిత్యం పర్యవేక్షించాలని, నిర్ణీత సమయానికి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు జీవీఎంసీ సీఈ సత్యనారాయణ రాజు, ఎస్.ఈ., జాతీయ రహదారుల విభాగం అధికారులు ఉన్నారు.

ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ

వైసీపీ జిల్లా అధ్యక్షులు కేకే రాజు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరిస్తుందని జిల్లా వైసీపీ అధ్యక్షులు కేకే రాజు విమర్శించారు. శనివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో "ప్రజా ఉద్యమం" పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యం పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ధోరణి వ్యవహరిస్తోందన్నారు. కేజీహెచ్‌లో 12గంటలు కరెంటు లేక రోగులు నానా ఇబ్బందులు పడితే అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహించారన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకంగా 12వ తేదీన నియోజకవర్గ కేంద్రాల్లో "ప్రజా ఉద్యమం" పేరిట రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నిరసన కార్యక్రమాలను చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, విద్యార్థులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేసి కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగేటట్లు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇండియా హ్యాబిటేట్ సెంటర్‌ను సందర్శించిన వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

విశాలాంధ్ర - విశాఖ: ఢిల్లీలో పేరొందిన ఇండియా హ్యాబిటెట్ సెంటర్‌ను వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, జాయింట్ కమిషనర్ కె.రమేష్‌లు శనివారం సందర్శించారు. విశాఖలో వీఎంఆర్డీఏ నేతృత్వంలో సుమారు 8.8 ఎకరాల స్థలంలో పీపీపీ విధానంలో ఇండియా హ్యాబిటెట్ సెంటర్ తరహాలో ఈస్ట్ కోస్ట్ హ్యాబిటెట్ సెంటర్ ను నిర్మించేందుకు ఇప్పటికే ప్రతిపాదించారు. ఇండియా హ్యాబిటెట్ సెంటర్ జిఎం అమర్నాథ్‌ను కలిసి, ఇండియా హ్యాబిటెట్ సెంటర్ నిర్మాణ శైలి, కన్వెన్షన్ సెంటర్లు, మీటింగ్ హాల్స్, కార్యాలయాలు, పచ్చదనం, హొటల్స్, సదస్సులు ఏర్పాటు చేసుకునేందుకు తగిన సదుపాయాలు, వసతి తదితర అంశాలపై చర్చించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో హ్యాబిటెట్ సెంటర్ నిర్మాణ ఆవశ్యకతను వివరించారు.

కురపల్లిలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - పద్మనాభం: ఎస్ఓఎస్ ఆధ్వర్యంలో శనివారం పాండ్రంగి పంచాయతీ పరిధిలో కురపల్లి గ్రామంలో విశాఖపట్నం మెడికవర్ హాస్పిటల్ వారు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో కంటి పరీక్షలు, సాధారణ వైద్య పరీక్షలు, ఈ సి జి, బి పి, షుగర్, పాప్స్‌నియర్ మొదలైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఈ అవకాశాన్ని స్థానిక గ్రామస్తులు సుమారు 250 మంది వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం మెడికవర్ హాస్పిటల్ డాక్టర్స్ హర్ష, ప్రోగ్రాం కోఆర్డినేటర్ వి.కిరణ్, ఎస్ఓఎస్ సిబ్బంది దుర్గారాజు, అనన్యదాస్, చందక జానకి, బత్తిన భారతి, మహిళా సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దేవాలయం మెట్లకు, ధ్వజ స్తంభానికి ఇత్తడి సేకరణ

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని గొట్టిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్నశ్రీ హరిహరపుత్ర సమేత అయ్యప్ప స్వామి సహిత మల్లేశ్వర స్వామి దేవాలయం పీఠంకు శనివారం స్థానిక సర్పంచ్ గంటా జగదీశ్వరరావు ఆధ్వర్యంలో గుడి 18 మెట్లకు, గజ స్థంభమునకు గ్రామంలో ఇత్తడిని సేకరించారు. పండితులు సూచన మేరకు గొట్టి పల్లి పంచాయతీతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో దేవాలయం 18 మెట్లకు, గజ స్థంభమునకు ఇత్తడిని సేకరిస్తున్నట్లు అయ్యప్ప స్వామి దేవాలయం కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అలాగే నిర్మాణంలో ఉన్న ఈ కోవెలకు వస్తు రూపంలో గాని ధన రూపంలో గాని ఎవరైనా విరాళం ఇవ్వవచ్చునని గొట్టిపల్లి అయ్యప్ప స్వామి దేవాలయ కమీటీ సభ్యులు తెలియజేశారు.

కాంగ్రెస్ సానుభూతిపరులపై ఏయూ కక్ష సాధింపు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కక్ష సాధింపునకు, అవినీతికి కేర్ అఫ్ అడ్రస్‌గా మారిందని కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రియాంక దండి తెలిపారు. యూనివర్సిటీ యాజమాన్యం కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుల మీద వేధింపులు చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడితే ఉద్యోగం నుండి తొలగిస్తామని హెచ్చరిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో యూనివర్సిటీలో చాలా మందికి ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయన్నారు. వారికి కాంగ్రెస్ పట్ల సానుభూతి ఉందన్నారు.అలాంటి వారిని వేధింపులకు గురి చేస్తున్నారని, ప్రస్తుతం ఉన్న వైస్ ఛాన్సలర్ ఆర్ఎస్ఎస్‌కు చెందిన వ్యక్తి అని, అతనికి కాంగ్రెస్ అంటే పడదని ప్రియాంక అన్నారు. ఏయూలో బ్యాక్ లాగ్ ఎస్సీ, ఎస్టీ పోస్టులకు సంబంధించి అక్రమాలు జరిగాయంటూ పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారాయని ఆరోపణలు వస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ తరుపున వైస్ ఛాన్సలర్‌పై విచారణకు డిమాండ్ చేస్తున్నామని ప్రియాంక అన్నారు.

నకిలీ సిమ్ కార్డుల ముఠా అరెస్ట్

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: కస్టమర్ల ఐడీలతో కస్టమర్లకి తెలియకుండా నకిలీ సిమ్ కార్డులు యాక్టివేట్ చేసి, బహుళ సంఖ్యలో సోషల్ మీడియా అక్కౌంట్స్ ఓపెన్ చేసి వాటితో డిజిటల్ అరెస్ట్ వంటి తీవ్ర సైబర్ క్రైమ్ నేరాలకి పాల్పడుతున్న కృష్ణా జిల్లాకు చెందిన 5గురు ముద్దాయిలను పట్టుకొని పోలీసులు అరెస్ట్ చేశారు. విశాఖపట్నం సిటీ పోలీస్ కమీషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ నియంత్రణ చర్యలో భాగంగా సైబర్ నేరాలకి పాల్పడే వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టి అత్యంత అధునాతన కేహెచ్‌ఓజె అప్లికేషన్ వంటి సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరగాళ్ల కదలికల ఆధారంగా కృష్ణాజిల్లాకు చెందిన అయిదు గురు ముద్దాయిలను వివిధ ప్రాంతాల్లో అదుపులోకి తీసుకొని విచారించారు. గాజువాక ప్రాంతానికి చెందిన బీఎస్ఈఎల్లో ఉద్యోగం చేస్తున్న యెల్ల లక్ష్మణకు గుర్తు తెలియని నెంబర్ నుంచి వ్యక్తి కాల్ చేసి తనను బెంగుళూరు పోలీస్ అధికారిగా పరిచయం చేసుకొని, "మీ పేరుతో ఒక నకిలీ సిమ్ కార్డ్ తీసుకొని దుర్వినియోగం చేస్తున్నారు, దానిపై కేసు నమోదు అయింది" అని భయపెట్టాడు. తర్వాత రోజు అదే నంబర్ నుండి మళ్ళీ కాల్ చేసి, ఈసారి "మీపై అంతర్జాతీయ కేసు నమోదైంది, సుప్రీం కోర్టు వారెంట్ జారీ చేసింది" అంటూ సిబిఐ అధికారిగా నటిస్తూ మరో వ్యక్తికి కాల్ ట్రాన్స్ఫర్ చేశారు. ఆ వ్యక్తులు బాధితుడికి భయం కలిగించి, "మీ పై కేసు తీసేయాలి అంటే రూ.15 లక్షలు చెల్లిస్తే మీ పేరు క్లియర్ అవుతుంది" అని చెప్పగా బాధితుడు భయంతో లోన్ తీసుకుని ఆర్ టి జి ఎస్ ద్వారా పంపించాడు. తరువాత వారు మిగతా మొత్తాన్ని కూడా డిమాండ్ చేయడంతో, అతను సంబంధీకుల నుండి రూ.4 లక్షలు అప్పుగా తీసుకొని అదే విధంగా ట్రాన్స్ఫర్ చేశారు, మొత్తం రూ.14 లక్షలు పంపిన తర్వాత కూడా డబ్బు డిమాండ్ చేయగా మోసం చేశారని తెలిసి సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ఫిర్యాదు చేయగా సైబర్ క్రైమ్ పోలీస్ డిజిటల్ అరెస్ట్ స్కామ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంబించగ విస్తుపోయిన నిజాలు బయటపడ్డాయి. నకిలీ సిమ్ కార్డ్స్ తయారు చేయాలనే ఉద్దేశంతో, మొబైలు సెల్ పాయింట్ (పాయింట్ ఆఫ్ సేల్) వద్దకి వచ్చిన కస్టమర్లకి తెలియకుండా కస్టమర్లు దగ్గర ఐరిస్ సరిగా పడలేదని చెప్పి రెండోసారి వాళ్ల దగ్గర నుంచి ఐరిస్ అండ్ వేలిముద్రలు తీసుకొని కస్టమర్ పేరు మీద ఇంకో నెంబర్‌ని యాక్టివేట్ చేసేవారు. ఇలా సుమారుగా వీరు 300 నుండి 350 సిమ్ముల వరకు యాక్టివేట్ చేసి ఈ సిమ్‌లను సైబర్ నేరాలకి పాల్పడే వారికి అందించే వారు. ఈ విధంగా ఫేక్ ఆక్టివాటేడ్ సిమ్ కస్టమర్ తెలియకుండా వేరొక సిమ్‌ను యాక్టివేట్ చేసి నెరస్తులకి అందించేవారు. ఈ కేసులో లోతైన దర్యాప్తు ప్రారంభించిన విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు ఈ నేరాలకు పాల్పడిన కృష్ణా జిల్లాకు చెందిన పులి నాగ తారకేశ్వరరావు, పదమాట శివకృష్ణ, బల్ల నాగరాజు, ఎర్ర నాగ వెంకట సాయి పవన్ చందు, షేక్ అబ్దుల్ కరీంలను అరెస్టు చేశారు.

రూ.15 కోట్లతో బీసీ రోడ్డు విస్తరణకు శంకుస్థాపన

విశాలాంధ్ర - పెదగంట్యాడ: 75వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు పులి లక్ష్మీబాయి వెంకట రమణా రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు, గాజువాక నియోజక వర్గ శాసన సభ్యులు పల్లా శ్రీనివాసరావు పెదగంట్యాడ సెంటర్లో బీసీ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అత్యధిక బడ్జెట్‌తో 15 వ ఫైనాన్స్ కమిషన్ నిధులు 15 కోట్ల 11 లక్షల రూపాయల విడుదల చేశారు అని అన్నారు. ఆ నిధులతో గాజువాక కాకతీయ జంక్షన్ నుండి పెద గంట్యాడ గాంధీ గారి విగ్రహం వరకు 130 అడుగులతో రోడ్డు విస్తరణ, సర్వీసు రోడ్లు, డ్రైన్లు, సెంటర్ లైటింగ్ తో తక్కువ వ్యవధిలోనే నిర్మాణం పూర్తి అవుతుందని పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమములో జనసేన పి ఈ సి సభ్యులు, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద రెడ్డి, కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, తిప్పల వంశీ రెడ్డి, బొడ్డు

నరసింహ పాత్రుడు, పల్లా శ్రీనివాసరావు, బోండా జగన్, టీడీపీ గాజువాక నియోజక వర్గ సమన్వయకర్త, ఏపీబీసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, బీజేపీ గాజువాక నియోజక వర్గ ఇన్‌చార్జి కరణం రెడ్డి నరసింగరావు, గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ మొల్లి పెంటి రాజు పాల్గొన్నారు.

లయన్స్ క్యాన్సర్ జనరల్ హాస్పిటల్‌కు విరాళం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: సామాజిక సేవా దృక్పథంతో నగరంలో అన్ని వర్గాల వారికి అందుబాటులో వైద్య సేవలను అందిస్తున్న లయన్స్ క్యాన్సర్ అండ్ జనరల్ హాస్పిటల్ అభివృద్ధికి అనేకమంది దాతలు విరాళాలు అందజేస్తున్నారు. శనివారం జిల్లా విశ్రాంత న్యాయమూర్తి సలాది నరసింహారావు తన తండ్రి సలాది గంగరాజు జ్ఞాపకార్థం హాస్పిటల్‌లోని అల్ట్రా సౌండ్, కలర్ డాప్లర్ గది ఆధునీకరణ నిమిత్తం రూ.1,50,000లు చెక్కును హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్టీ, ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆచార్య ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ హాస్పిటల్ అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందించిన న్యాయమూర్తి నరసింహారావుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం అన్నారు. ఈ విధంగా దాతలు ముందుకు రావడం సంతోషించదగ్గ విషయం అని పేర్కొన్నారు. సేవా భావంతో నడుపుతున్న ఈ ఆసుపత్రికి అందరి సహకారం అవసరమన్నారు. హాస్పిటల్ అభివృద్ధికి విరాళాలు అందజేయగోరు వారు నేరుగా వచ్చి తమ తమ సహాయ సహకారాలను అందించాలని కోరారు.

విజయవంతంగా ఇండియన్ హార్ట్ రిథమ్ సొసైటీ నేషనల్ కాన్ఫరెన్స్

హృదయ విద్యుత్ శాస్త్ర అభివృద్ధికి కొత్త దిశ

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఇండియన్ హార్ట్ రిథమ్ సొసైటీ (ఐ హెచ్ ఆర్ ఎస్) వార్షిక జాతీయ సదస్సు ఐరిస్కాన్ 2025 అక్టోబర్ 31 నుంచి నవంబర్ 2 వరకు విశాఖపట్నంలో విజయవంతంగా నిర్వహించబడింది. "ఒక రిథమ్, ఒక లక్ష్యం: సహకారంతో ఎలెక్ట్రోఫిజియాలజీ అభివృద్ధి" అనే అంశంతో మూడు రోజులపాటు జరిగిన ఈ సదస్సులో దేశ, విదేశాల ప్రముఖ హృదయ నిపుణులు, పరిశోధకులు, వైద్యులు పాల్గొన్నారు. ఈ సదస్సు హృదయ రిథమ్ లోపాల నిర్వహణలో తాజా పురోగతులు, కాథెటర్ అబ్లేషన్ వంటి నూతన సాంకేతికతలు, మరియు ఎలెక్ట్రోఫిజియాలజీ రంగాన్ని మార్చుతున్న సాంకేతిక ఆవిష్కరణలపై చర్చించేందుకు ముఖ్య వేదికగా నిలిచింది. ఆర్గనైజింగ్ సెక్రటరీ, మెడికవర్ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్టు, ఎలెక్ట్రోఫిజియాలజిస్టు మాట్లాడుతూ "ఈ ప్రతిష్టాత్మక సదస్సును విశాఖపట్నంలో ఆతిథ్యం ఇవ్వడం మా గౌరవంగా భావిస్తున్నాము," అన్నారు. ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ సి. నరసింహన్, హెడ్ ఆఫ్ ఎలెక్ట్రోఫిజియాలజీ, ఏఐజి హాస్పిటల్, హైదరాబాద్ మాట్లాడుతూ, "మా లక్ష్యం ప్రతి ఒక్కరికీ నేర్చుకునే, అభివృద్ధి చెందే వేదికను కల్పించడం. ఈ సదస్సులో జరిగిన సజీవ చర్చలు, సహకారాలు దేశవ్యాప్తంగా హృదయ రిథమ్ రుగ్మతల

చికిత్సా ప్రమాణాలను మెరుగుపరచాలన్న మా కట్టుబాటును మరింత బలపరిచాయి," అని తెలిపారు. ఐ హెచ్ ఆర్ ఎస్ అధ్యక్షుడు డాక్టర్ అజయ్ నాయిక్, డైరెక్టర్ ఆఫ్ ఎలెక్ట్రోఫిజియాలజీ, సిమ్స్ హాస్పిటల్, అహ్మదాబాద్ మాట్లాడుతూ, "ఈ సదస్సు నెట్‌వర్కింగ్, ఆలోచనల మార్పిడి, మరియు జ్ఞాన పంచుకోవడానికి అద్భుత వేదికగా నిలిచింది. ఐ హెచ్ ఆర్ ఎస్ లక్ష్యం అయిన ఎలెక్ట్రోఫిజియాలజీ రంగంలో విద్యా అభివృద్ధి, మెంటార్‌షిప్ మరియు చికిత్సా ప్రమాణాల మెరుగుదల దిశగా ఇది కీలకమైన అడుగుగా నిలిచింది," అని అన్నారు. ఈ సదస్సులో మొత్తం 305 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఫ్యాకల్టీగా భారతదేశం, అమెరికా, తైవాన్, యూకే, ఆస్ట్రేలియా, శ్రీలంక దేశాల నుండి సీనియర్ ఎలెక్ట్రోఫిజియాలజిస్టులు పాల్గొన్నారు.

వేంకటాద్రిపై శ్రీనివాసునికి సహస్రనామార్చన

విశాలాంధ్ర - పెందుర్తి: ఉత్తరాంధ్ర తిరుపతిగా భాసిల్లుతున్న పెందుర్తి వేంకటాద్రిపై శ్రీనివాసునికి శనివారం సహస్ర నామార్చన, అష్టోత్తరం, దూపసేవ, దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రదానార్చకులు మహర్షి రామానాజాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు ముందుగా స్వామి వారిని మేల్కొలిపి, సుప్రభాత సేవ, తోమాల సేవ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా ఉచిత ప్రసాద వితరణ చేశారు. కొండ దిగువ నుండి స్వామి సన్నిధి వరకు ఉచిత వాహన సదుపాయం కల్పించారు. జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు తదితర ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

షఫీ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - పెందుర్తి: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఏపీ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షేక్ షఫివుల్లా ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువకుల సమక్షంలో షఫీ కేకు కట్ చేసి అందరికీ ఆప్యాయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో దొరల పాలనను అంతమొందించి ప్రజా పాలన ప్రారంభించిన రేవంత్ రెడ్డి ప్రజల కోసం విప్లవాత్మకమైన కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు పథకం, పేదలకు సన్న బియ్యం పంపిణీ వంటి పథకాలు బహుళ ప్రజాదరణ పొందాయని వెల్లడించారు. అలాగే హైడ్రా వ్యవస్థను నెలకొల్పి ఆక్రమణల తొలగింపు చర్యలు సంచలనం సృష్టించాయని వెల్లడించారు. ముఖ్యంగా మూసీ నది ప్రక్షాళన రేవంత్ రెడ్డి ప్రభుత్వ సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచిందన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణకు పరిశ్రమలు పెద్ద ఎత్తున వస్తున్నాయని తద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తోందన్నారు. అలాంటి సమర్థుడైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మరింత జన రంజకంగా పాలన సాగించాలని షఫీ ఆకాంక్షించారు.

భర్త ఆచూకీ కోసం భార్య ఫిర్యాదు

విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని, పెందుర్తి మండలం బంటా కాలనీకి చెందిన శిష్టి దేవి తన భర్త షష్టి రమణ ఆచూకీ కోసం పెందుర్తి పోలీసులకు పిర్యాదు చేసారు. దీనికి సంబంధించి సిఐ కెవి సతీష్ కుమార్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. శిష్టి రమణ (37) అక్టోబర్ 31న ఉదయం సుమారు 8 గంటలకు కూలి పనికోసం ఇంటి నుండి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని, ఆయన ఆచూకీ కనుగొనవలసిందిగా శిష్టి దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. ఇంటి నుండి వెళ్లిన సమయంలో రమణ పసుపు రంగు టీ-షర్ట్, నీలం రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని వెల్లడించారు. శిష్టి రమణ గురించి ఎవరికైనా ఆచూకీ, వివరాలు తెలిసినట్లయితే వెంటనే కింది ఫోన్ నంబర్లకు సమాచారం అందించవలసిందిగా సిఐ సతీష్ కుమార్ కోరారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ 96767 97314, ఇన్స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ 94407 96039 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర -పెందుర్తి: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.3,55,013 లక్షల రూపాయల చెక్కులను ఏడుగురు లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పంపిణీ చేసారు. అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ హాస్పిటల్‌లో మెరుగైన వైద్యం చేయించుకుని ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ వర్తించని బాధిత కుటుంబాలకు సుజాతనగర్ క్యాంపు కార్యాలయంలో శనివారం చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కొలచిన మాణిక్యాంబ 60 వేలు, సాలాపు రాజు 40 వేలు, గోకాడ రాజబాబు 60 వేలు, నెక్కిలా పైడికొండ 39 వేల 786 బంధం శివలక్ష్మి 20 వేలు, ఇచ్చిపురపు పెంటం నాయుడు 20 వేల 227 రూపాయలు, రాయవరపు సూరిబాబు 1.15 లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కర్రి కనకరాజు, బొడ్డపు శ్రీనివాసరావు, కరక దేవుడు, సబ్బవరం మండలం టీడీపీ సీనియర్ నాయకులు మిడతాన మహాలక్ష్మి నాయుడు, సీనియర్ నాయకులు ఇందల రమణ, మాజీ జడ్పిటిసి సభ్యులు రంగలి దేవుడు బాబు ,వార్డు అధ్యక్షులు సేనాపతి శేఖర్, పిన్నింటి పార్వతి, కంచిపాటి మధు, పెందుర్తి ఏ ఎమ్ సి డైరెక్టర్ ఆర్ఎస్ నాయుడు, లక్కీ గోవింద్, ఎంపీటీసీ గొల్లవిల్లి రమణ, సుందరపు శ్రీనివాసరావు, అప్పల రాజు, తనకాల శ్రీనివాసరావు, మోటూరు చైతన్య, రాపర్తి కిషోర్, పల్లా రమణ, సబ్బవరపు రమణ, సబ్బవరపు నరసింహ మూర్తి, కర్రీ శివ తదితరులు పాల్గొన్నారు.

చిక్కోలు చేనేతను సందర్శించిన లోకేష్

విశాలాంధ్ర-ఆమదాలవలస: చిక్కోలు చేనేత ఉత్పత్తిదారుల కంపెనీని వారు చేనేత వస్త్రాలు ప్రదర్శన స్టాల్స్ ను ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మరియు ఐటీ మంత్రివర్యులు నారా లోకేష్ శనివారం సందర్శించారు. విజయవాడలో ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ కౌన్సిల్ వారు నిర్వహించిన ప్రదర్శన స్టాల్స్ను,పొందూ రు ఖాది విశిష్టతను చేనేత ఉత్ప త్తిదారులు అభివృద్ధికి ప్రభుత్వ సహకారం ఒంటి అన్ని విషయా లను అడిగి తెలుసుకున్న మంత్రి చేనేతకు అన్నివేళలా ప్రభుత్వ సహకారం ఉంటుందని హామీ ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ ఆర్ట్స్ సంస్థ మరియు నాబార్డ్ వారి సహకారంతో బుర్జ మండలంలో ఉప్పి నివలస గ్రామం ఆముదాలవలస మండలం శ్రీనివా సాచార్యులు పేటలో చేనేత కార్మి కులతో కంపెనీ ఏర్పా టు చేయడం జరిగింది. ఈ కంపెనీ ద్వారా 500 మంది చేనేత ఉత్పత్తిదారులు పొందూరు ఖాది ద్వారా అధు నాతన మోడల్స్ తో చీరలు, డ్రెస్ మెటీరియల్, షర్టు ప్యాంట్లు తయారు చేసి ఆన్లైన్ మరియు ఆఫ్లైన్లో మార్కెటింగ్ చేస్తున్న ట్లు వివరించారు. ఈ చేనేత ప్రద ర్శనలో సందర్శించిన మంత్రి కి ఈ సంస్థ ప్రతినిధులు ధన్యవాదాలు తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో సిక్కోలు చేనేత ఉత్పత్తిదా రుల కంపెనీ సీఈవో బి అప్పలనాయుడు, మాట్లాడు తూ ఈ కంపెనీ ద్వారా ఆర్గానిక్ ఖాదీని ప్రోత్సహించ డం జరుగుతుందని మహిళలకు చేనేత కార్మికులకు అధునాతన పద్ధ తుల్లో శిక్షణలో అందించి మార్పింగ్ చేయడం జరు గుతుందని ఈ అవకాశాన్ని చేనేత కార్మికులు బాగా ఉపయోగించుకుంటున్నారని తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో

జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలి

- జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: రాజమండ్రి వేదికగా ఈ నెల 11న జరుగనున్న రాష్ట్ర స్థాయి సీనియర్స్ ఫెన్సింగ్ పోటీలలో జిల్లా క్రీడాకారులు సత్తాచాటాలని జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా పిలుపునిచ్చారు. ఫెన్సింగ్ కోచ్ లు ఇచ్చిన శిక్షణను ఉపయోగించుకుని పోటీలలో ప్రతిభ కనబరచి పతకాలు సాధించాలని అన్నారు. శ్రీకాకుళంలోని టౌన్ హాల్ వేదికగా శనివారం జిల్లా స్థాయిలో సీనియర్స్ ఫెన్సింగ్ పోటీల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. బహుజన నేత డా. కంత వేణు ,పూర్వపు అధ్యక్షుడు వైశ్యరాజు మోహన్ ఇతర అసోసియేషన్ సభ్యులతో కలసి బలభద్రుని రాజా ఫెన్సింగ్ పోటీలను ప్రారంభించారు. అనంతరం కోచ్ ల పర్యవేక్షణలో సీనియర్స్ విభాగం ఫెన్సింగ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. శ్రీకాకుళం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలను పక్కా ఏర్పాట్ల నడుమ నిర్వహించారు. సీనియర్ విభాగంలో బాల,బాలికలకు వేర్వేరుగా పోటీలు జరిగాయి. ఈ పోటీలలో ప్రతిభ కనబరచని క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకి ఎంపికయ్యారు. వారికి జిల్లా అధ్యక్షుడు రాజా ఆల్ ది బెస్ట్ తెలియజేసారు. జిల్లాలో క్రీడాకారులకు కొదవ లేదని,వారికి అవసరమైన శిక్షణలను ఇచ్చే శిక్షకులు జిల్లాలో ఉన్నారన్నారు. క్రీడాకారులు శిక్షణలను అందిపుచ్చుకుని క్రీడా పోటీలలో రాణించాలని ఆయన కోరారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా ఎన్ .ఐ.ఎస్ కోచ్ జోగిపాటి వంశీ వ్యవహరించారు. ఈ పోటీలలో జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు భవానీ,సంపతిరావు నాయుడు,పిఇటి,పిడిలు,కోచ్ లు రాహుల్ , హేమంత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

దూసి ఆర్ఎస్‌ను అభివృద్ధి చేస్తాం: డిఆర్ఎం

విశాలాంధ్ర-ఆమదాలవలస: జిల్లాలోని దూసి రైల్వే స్టేషన్ ను అభివృద్ధి చేస్తామని డిఆర్ఎం లలిత్ మెహ్రా పేర్కొన్నారు. శనివారం రైల్వే స్టేషన్ లోని పరిసరాలు పరిస్థితులు పరిశీలించారు.శ్రీకాకుళం జిల్లా దూసి రైల్వే స్టేషన్ ను వాల్తేర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సందర్శించి, ప్రయాణికుల కు ప్రస్తుత కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రయాణికుల అవ సరాలు, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలను రూపొం దించాలని ఆదేశించారు. ఇటీవల జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రయాణికులు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కు దూసి రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో మంత్రి సూచనల మేరకు డిఆర్ఎమ్ లలిత్ మెహ్రా శనివారం రైల్వే అధికారులతో కలిసి దూసి చేరుకుని సమగ్ర సమీక్ష నిర్వహించారు. స్టేషన్‌లోని ప్లాట్‌ఫారమ్‌లు, రైల్వే ట్రాక్‌లు, ప్రయాణికుల వేచి ఉన్న చోట్ల, సౌకర్యాలు, తాగునీటి వసతి, లైటింగ్ సదుపాయాలు, రోడ్డు కనెక్టివిటీ వంటి అంశాలను పరిశీలించారు. దూసి రైల్వే స్టేషన్ లో ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న చెట్టును పరిశీలించి ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయా లని సూచించారు. క్విట్ ఇండియా ఉద్యమ సమయం లో గాంధీజీ దూసిలో అడుగిడినారని, అదే సమయం లో అక్కడ ఉన్న మర్రి చెట్టు వద్ద స్థానిక ఉద్యమకారు లతో మాట్లాడారని చరిత్ర చెబుతోంది. ఈ నేపథ్యంలో నే ఈ ప్రాంత అభివృద్ధికి రైల్వే స్టేషన్ ఎంతగానో ఉప కరిస్తుందని స్థానికులు పాలకులకు పలుమార్లు వినతి పత్రాలు అందించి అభివృద్ధిని ఆకాంక్షించారు. శని వారం డిఆర్ఎం పరిశీలించి అభివృద్ధికి చర్యలు చేపడతామని తెలిపారు.

రైతులకు ఆర్డీఎస్ కిట్లు పంపిణీ

విశాలాంధ్ర- నరసన్నపేట: మండలంలోని ప్రకృతి వ్యవసాయం లో వరి పండించే దేవాది రైతులకు ఆర్డీఎస్(రబీ డ్రై స్లోయింగ్) అపరాలు విత్తనాలు పంపిణీ చేశారు. శనివారం మండలంలోని రావులవలస యూనిట్ కు చెందిన మాకి వలస రైతు సేవ కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైని, తోట రామారావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కిట్లలో తోటకూర, గోంగూర, అలసంద, గోరుచిక్కుడు, పాలకూర, కొత్తిమీర, బీర, కంది, కట్టే జనుము, బెండ తదితర 11 రకాల విత్తనాలు, 11 కిలోల అపరాలలో కలుపుకొని, పొలములో రైతులు చల్లుకోవాలన్నారు. ఈ విధంగా చేయడం వలన అపరాలతోపాటు ప్రతినెల నుండి ఆరు నెలల వరకు ఈ పంటలు పండించుకోవచ్చు అన్నారు. అదేవిధంగా బయోడైవర్సిటీ క్రాప్ పండించడం వలన భూసారం పెరుగుతుందని, పంటలకు చీడ పీడలు రాకుండా, పంటలకు పనికివచ్చే సూక్ష్మజీవులు(మిత్ర పురుగులు) పెరుగుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇంచార్జ్, కే. రాజేశ్వరమ్మ, ఐసి ఆర్పి లు, కమలమ్మ, రమాదేవి, లీలాదేవి, సింహాద్రి తోపాటు రైతులు పాల్గొన్నారు.

నగరంపల్లి పాఠశాలను సందర్శించిన నేపాల్ బృందం

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: నేపాల్ దేశానికి చెందిన సోషల్ సర్వీస్ సెంటర్ ఆరుగురు సభ్యుల బృందం వజ్రపుకొత్తూరు మండలంలోని నగరంపల్లి జడ్పి ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న ఈఎండిపి (వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం) అధ్యయనం కోసం విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన వినూత్న ప్రాజెక్ట్ లను చూసి అభినందించారు. ఇవి విద్యార్థులు తమచుట్టూ ఉన్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారం కనుక్కొని సమాజాన్ని ప్రభావితం చేయడమే కాకుండా వారిని వ్యవస్థాపకులుగా మార్చే దిశగా రూపొందించినది ఈ కార్యక్రమమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తలగాన హేమరావు, ఈఎండిపి జిల్లా మేనేజర్ అనూష, నేపాల్ దేశ బృంద సభ్యులు హిర సింగ్ తాప, మాధవ్ భట్టారి, మాయ అధకారి, మేనక చట్టేరి, జీబ్ రాజ్ రెగ్మి, సమీక్ష్య రెగ్మి, ఎస్ఎంసీ చైర్మన్ బి. లక్ష్మిపతి, ఈఎండిపి ఉపాధ్యాయులు కొయ్యల శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాచీన బాలి యాత్రను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - సరుబుజ్జిలి: ప్రాచీన కాలము నుండి సనాతన ధర్మ బాలి యాత్రను ప్రజలంతా ఆదరించి విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీ రావు శనివారం సరుబుజ్జిలి మండలంలో పత్రికా ప్రకటనలో తెలియజేశారు. వేల సంవత్సరాలుగా కలింగ ప్రజల నౌకాయానమే బాలియాత్రగా ప్రసిద్ధి చెందిందని తెలిపారు. బాలియాత్ర అన్నది వంశధార నాగావళి నదులకే పరిమితం కాక కళింగ ప్రాంతంలోని అన్ని నదులలో బాలియాత్ర చేసి కళింగ ప్రాంతపు సంస్కృతి సాంప్రదాయాలను పునరుద్ధరించవలసిన అవసరం అందరిదని అన్నారు. బాలి ద్వీపం నేటి ఇండోనేషియా దేశంలో ఉన్న ఒక ద్వీపం, ఈ ద్వీపం కేంద్రంగానే కళింగులు ఆగ్నేయ ఆసియా దేశాలతో వ్యాపారం చేయడం వలన దీనికి బాలి యాత్ర అని పేరు వచ్చింది. కార్తీక పౌర్ణమి రోజు నౌకలు కళింగ ఓడరేవుల నుండి నదులలో బయలుదేరేవి తమ నౌకలో క్షేమంగా వెళ్లి లాభంగా రావాలని స్త్రీలు అరటి డొప్పలలో దీపాలు వెలిగించి నదులలో విడిచి పెట్టేవారు. ఈ సాంప్రదాయం వేల ఏళ్ల నాటినుండి ప్రజల్లో కొనసాగుతుంది, ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేని రోజులలో నక్షత్రాలు, రుతుపులు, సముద్రంపై వీచే గాలుల ఆధారంగా వేల సంవత్సరాలు కళింగులు నౌకలపై వివిధ దేశాలలో వ్యాపారం చేశారని సనపల అన్నాజీ రావు పేర్కొన్నారు. ప్రపంచానికి సముద్రంపై నౌకల ద్వారా ప్రయాణం చేయవచ్చని తెలియజేసిన ఘనత మన సిక్కోలు ప్రజలదే అని గర్వాంగా చెప్పొకోవచ్చని అన్నారు. ఆగ్నేయ ఆసియా ద్వీపాలైన శ్రీలంక, ఇండోనేషియా, సింగపూర్, మలేషియా, ఫిలిప్స్ దేశాలతోపాటు చైనా తో కూడా వ్యాపారం జరిపేవారన్నారు. వ్యాపార సంబంధాలు ఆగ్నేయ ఆసియా దేశాలతోపాటుగా పశ్చిమ ఆసియా దేశాలైన ఈజిప్టు, పర్షియా, రోమ్, గ్రీస్ దేశాలలో తమ సరుకులు అమ్మి తద్వారా వచ్చిన ధనముతో ఆనాడు భారతదేశం అత్యంత ధనిక కలింగ జనపదంగా ఆవిర్భావించిందని అన్నారు. ఈ బాలి యాత్ర గత వైభవం గుర్తించుకునేలా, భవిష్యత్తులో మరింత స్థాయికి ఎదిగే విధంగా జరగాలని ఆకాంక్షించారు. ఈ యాత్రలో అందరు పాల్గొని విజయవంతం చేయాలనీ అన్నారు.